క్లుప్తంగా

మిట్టమల్లేశ్వరునికి వెండి పాత్ర బహూకరణ



వెండి పాత్రను చైర్మన్‌కు అందజేత కార్యక్రమంలో దాతలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వరస్వామికి దాతలు కోనపురి రాము, సుగుణ దంపతులు సోమవారం 2 కిలోల వెండి పాత్రను బహూకరించారు. వారిచే ఆలయ అర్చకుడు రుద్రమూర్తి.. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి వారికి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ రమణ, పాలక మండలి సభ్యులు మాధవాచారి, సోమేశ్వరమ్మ, మల్లికార్జున, రాజశేఖర్, చంద్రావతి, వాణి, సూర్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదాన కార్యక్రమంలో యువత

పులివెందుల రూరల్ : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ప్రతినిధి కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రామ్ లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి మాట్లాడుతూ రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు రాఘవేంద్రారెడ్డి, మణికంఠ, మోహన్ రెడ్డి, పవన్, మస్తాన్, జయతేజరెడ్డి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

లయోల పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టో

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టో మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ముస్తకీమ్ పఠాన్, సోమశేఖర్ ఈ నెల 16, 17 తేదీలలో గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఆవిస్కార్-2023లో ఇన్నవేటివ్ ఐడియా మోడల్స్‌లో పాల్గొని ప్రథమ బహుమతి గెలుపొందారన్నారు. వీరికి కేఎల్ యూనివర్సిటీ వారు రూ.15 వేలు నగదుతో సత్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్ల కేటాయింపుపై హర్షం



దేనియల్ బాబు

పులివెందుల టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులను ఎక్కువ మందిని నిలపడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేనియల్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఇన్ని సీట్లు ఇవ్వలేదని, ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే సామాజిక న్యాయం పాటించి ఎక్కువ సీట్లు ఇచ్చిందన్నారు. దమ్ముంటే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్నా ఎక్కువ సీట్లు ఇచ్చే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కావున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కుక్కలు, పందులను నివారించండి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని వార్డులలో విచ్చలవిడిగా కుక్కలు, పందులు సంచరిస్తున్నాయని, వాటిని నివారించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ 17వ వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి సోమవారం మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్యకు వినతి పత్రం అందించారు. 17వ వార్డులో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయన్నారు. వార్డులలో కుక్కలు చాలా తిరుగుతూ వృద్ధులు, పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులపై దాడి చేస్తున్నాయని చెప్పారు. అలాగే పందులు కూడా విపరీతంగా సంచరిస్తున్నాయని తెలిపారు. ఇవి ప్రజలకు చాలా ప్రమాదకరంగా మారాయన్నారు. వెంటనే వాటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చింతకొమ్మదిన్నె : ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చెన్నూరు : ప్రచారం నిర్వహిస్తున్న నరేన్ రామాంజనేయులురెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం 18వ డివిజన్‌లో గల భాకరాపేట, విశ్వనాథపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ఒక పేపర్‌లా కాకుండా ఖురాన్, బైబిల్, భగవద్గీత గ్రంథాల్లా ఆలోచించి రూపొందించడం జరిగిందన్నారు. గత ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల్లో 99 శాతం పూర్తి చేసిన ఘనత మన రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. తిరిగి ఈ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, 18వ డివిజన్ నాయకుడు జిలానిబాషా, 16వ డివిజన్ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి, ఇన్‌చార్జి గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, మతి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు అందించడమే లక్ష్యం

చెన్నూరు : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రతి ఇంటికీ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలన్నా తిరిగి మనమందరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమలాపురం శాసన సభ్యుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు పోచంరెడ్డి నరేన్ రామాంజనేయులురెడ్డి అన్నారు. చెన్నూరులోని చౌడమ్మ వీధిలో ఆయన తన తండ్రి ఎమ్మెల్యే అభ్యర్థి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వం తరపున లబ్ధి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని చెబుతున్న దమ్మున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. జన్మభూమి కమిటీలతో తన వారికి లబ్ధి చేకూర్చుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులు అయితే చాలు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. రాజకీయ అవసరాల కోసం ప్రజల్లోకి వచ్చి ఎన్నో దొంగ హామీలు ఇచ్చి మోసగించే వారి కన్నా, తను మేనిఫెస్టోలో ఏవైతే చెప్పడం జరిగిందో వాటిని అమలు చేసిన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. అక్కా, చెల్లెమ్మలు, అవ్వా తాతలు అందరూ దీవెనలు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, రవిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్సార్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, విజయ్, జగన్నాథం, పీసీ కేశవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకే ఓటేద్దాం

ఎన్నికల ప్రచారంలో డాక్టర్ రమ్యతారెడ్డి



బాలయ్యగారిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో ప్రతి ఇంటికి మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేసి గెలిపిద్దామని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం గొందిపల్లె గ్రామ పంచాయతీలోని గొందిపల్లె, బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారిపల్లె, రామచంద్రాపురం, ఇందిరానగర్ గ్రామాల్లో ఆమె ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో అయితే మీకు మేలు జరిగిందో వారికే ఓటు వేయాలని సూచించారు. రాబోయే ఎన్నికలల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పొలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, రామగంగిరెడ్డి, గంగిరెడ్డి, నరసింహారెడ్డి, బాబుల్‌రెడ్డి, సిద్దారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



ఇంటింటి ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండలం పరిధిలోని కర్చుకుంట పల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను పంపిణీ చేస్తూ.. లబ్ధిదారులు పొందిన లబ్ధిని వివరిస్తూ ప్రచారం సాగింది. వచ్చే ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డిలను మళ్లీ రెండవసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, గ్రామ సర్పంచ్ సుబ్బరాయుడు, రమణలు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

20న ఆలయ వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని సుందరయ్య కాలనీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పదో వార్షికోత్సవం ఈ నెల 20వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వేడుకల పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. అలాగే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

ర్యాలీలకు అనుమతి తప్పనిసరి



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

జమ్మలమడుగు : రాజకీయ పార్టీలు తమకు ఇష్టం వచ్చినట్లు ర్యాలీలు చేయడం కుదరదని, ముందస్తుగా అనుమతులు తీసుకుని రూట్ మ్యాప్‌ను సమర్పించిన తర్వాతే సాధ్యాసాధ్యాలను బట్టి అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆర్డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ ప్రచారాలకు దేవాలయాలు, చర్చిలు, మసీదులను ఉపయోగించుకోకూడదన్నారు. పాఠశాలల్లోని ఆటస్థలం, మైదానంలో సమావేశాలు, బహిరంగ సభలను నిర్వహించుకోవడానికి ముందుగా పోలీసు అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీ కార్యాలయాలు పోలింగ్ కేంద్రానికి 400 మీటర్లలోపు దూరంలో ఉండకూడదన్నారు. పార్టీ కార్యాలయాల్లో ఇష్టం వచ్చినట్లు జెండాలు, ఫెక్సీలను ఏర్పాటు చేయరాదన్నారు. జెండాలు కూడా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మాత్రమే ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి 18 ఏళ్లలోపు పిల్లలను ఉపయోగించుకోకూడదన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని, దానికి అనుగుణంగా రాజకీయ పార్టీలు నడుచుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాలలో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలను తమ అధికారులు ఇప్పటికే తొలగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డీఎస్పీ యశ్వంత్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. నియోజకవర్గంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టి, నేర చరిత్ర ఉన్న వారిపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మస్తాన్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి నాబార్డు సహకారం

కడప కల్చరల్ : నాబార్డు సంస్థ మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వాతంత్ర్యం పొందేందుకు ఎంతో సహకరిస్తోందని ఆ సంస్థ ఏజీఎం విజయ్ విహారి అన్నారు. స్థానిక దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఓబులదాస్ ఆధ్వర్యంలో 15 రోజులపాటు సంస్థ కార్యాలయంలో చిరుధాన్యాలతో ఆకర్షణీయమైన, ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేయడంలో 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. సోమవారం శిక్షణ ముగిసిన సందర్భంగా నాబార్డు అధికారి, శిక్షకులు వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు ప్రశాంతి , నాబార్డు అధికారులు సురేష్ సహాయం, హరూన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం సహకరించాలి

ప్రచారంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆకుతోటపల్లె, చిన్నకత్తెరపల్లె గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో సంక్షేమ పథకాల అమలులో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలన్నీ మళ్లీ అమలు కావాలంటే వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో వున్న తనకు, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథరెడ్డి, రాజా, ఓబులేసు, రామాంజి, సుదర్శన్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుమంత్ పాల్గొన్నారు.

నేడు కలమల్లలోని పునరావాస కాలనీలో..

ఎర్రగుంట్ల : మండల పరిధి కలమల్ల గ్రామ పంచాయతీలోని పునరావాస కాలనీలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నారని పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటింటి ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : త్వరలో జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు అత్యధిక మెజార్టీ రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని 15వ వార్డులో గడపగడపకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆ వార్డు కౌన్సిలర్ బొగ్గిటి డేనియల్ పురుషోత్తం, లిడ్ క్యాప్ డైరెక్టర్ రాజేశ్వరి కృష్ణమూర్తి, కోఆప్షన్‌మెంబర్ దాసరి చంద్రమౌళి, మాజీ కౌన్సిలర్ కోళ్లభాస్కర్, సూరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని వివరిస్తూ రాబోయే ఎన్నికలలో జగనన్నను, వైఎస్ అవినాష్ అన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబకపల్లి అంజి, నూర్‌బాషా సంఘం అధ్యక్షులు ఫక్ళ్రుద్దీన్, వీరయ్య, సుధాకర్, అజరయ్య, మధు, వెంకటస్వామి, సుమిత్ర, మహేష్, సలీంబాబు, యోహాన్, శ్రీను, నాగరాజు, భార్గవ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



చెన్నూరు : కేంద్ర బలగాలతో కలిసి పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



పెద్దముడియం : కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

చెన్నూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ పార్థసారథి అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని ఉప్పరపల్లె (సమస్యాత్మకమైన) గ్రామపంచాయతీ, అలాగే కొక్కరాయపల్లెలో కేంద్ర బలగాలైన సశస్త్ర సీమాబల్ సిబ్బంది (ఎస్ఎస్‌బీ)తో కలిసి కార్డన్ సెర్చ్‌తోపాటు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు సమస్యాత్మకమైన గ్రామాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. పచ్చని గ్రామాలలో ఎలాంటి సమస్యలు పెట్టుకోకుండా అందరూ కలిసిమెలసి అన్నదమ్ముల వల్లే ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలా కాకుండా ఇష్టానుసారుగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

పెద్దముడియం : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దపసుపుల, చిన్నపసుపుల, నెమళ్లదిన్నె, జె.కొట్టాలపల్లె, జంగాలపల్లె, గుండ్లకుంట గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎవరి ఓటు వారు నిర్భయంగా వేసుకోవాలని తెలిపారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



పులివెందుల టౌన్ : పరీక్షా కేంద్రంలో విద్యార్థులు

పులివెందుల టౌన్ : పులివెందుల క్లస్టర్ పరిధిలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పులివెందుల పట్టణంలోని 9 కేంద్రాల్లో 1686 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ రామానాయుడు తనిఖీ చేశారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకూడదని పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

సింహాద్రిపురం : జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారని, కేజీబీవీ సెంటర్‌లో 200 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓలు శ్రీనివాసులరెడ్డి, శారదా తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించినట్లు వారు పేర్కొన్నారు.

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా ఐదు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ప్రొద్దుటూరు డీవైఈఓ కృష్ణప్ప, డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, మండల విద్యాధికారి శివప్రసాద్ పర్యవేక్షించారు. రెగ్యులర్ విద్యార్థులు 818 మందికి గాను 817, ప్రైవేటు విద్యార్థులు 37 మందికి గాను 21 మంది హాజరు అయ్యారని వారు తెలిపారు.

చింతకొమ్మదిన్నె : మండల వ్యాప్తంగా 729 మంది విద్యార్థులకు గాను 716 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలు మండల పరిధిలోని శ్రీ చైతన్య క్యాంపస్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.

వల్లూరు : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో జరిగిన తెలుగు పరీక్షకు 365 మంది విద్యార్థులకు గాను 362 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 248 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 245 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 117 మంది పరీక్ష రాయాల్సి వుండగా, 117 మంది హాజరయ్యారు.

చెన్నూరు : మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ పాఠశాల కేంద్రాలలో మొత్తం 351 మంది విద్యార్థులకు గాను 344 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. ఆర్ఆర్ పాఠశాలలో 168 మంది విద్యార్థులకు గాను 167 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో 183 మంది విద్యార్థులకు గాను 177 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు.

కమలాపురం : కమలాపురం పట్టణంలోని మూడు కేంద్రాల్లో మొదటి రోజు పరీక్షలు సజావుగా సాగాయి. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బేబి తెలిపారు. గురుకుల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను ఒకరు, జెడ్పీ బాలికల హైస్కూల్ కేంద్రంలో 143 మందికి గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. బాయ్స్ హైస్కూల్‌లో 159 మందికి గాను 100 శాతం విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని కడప డీఎస్పీ షరీఫ్ తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా చూడాలని ఆయన పోలీసులకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. త్వరలో జరగబోయే ఎన్నికలల్లో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు.



ఎర్రగుంట్ల : పరీక్షా కేంద్రంలో డీవైఈఓ, డిప్యూటీ తహసీల్దార్, ఎంఈఓ



పెండ్లిమర్రి : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ షరీఫ్

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సోమవారం కుమ్మరాంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు వివిధ అంశాలపై స్థానికులకు అవగాహన కలిపిస్తూ వారి స్థితిగతులను మదింపు చేయడం జరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎంపీపీ స్కూల్ హెడ్ టీచర్ రెడ్డిమాలతి మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక శిబిరం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆఫీసర్ మల్లేశ్వరమ్మ, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు.